పట్వారి మన అయిదూల్లపేరట ముప్పైకిలోలు అడిగే నాయబ్ తాసిల్దారు సంతకము సెయ్యమంటె ఇరువైకిలోలు అడిగె.... గీవన్ని సూసుకొని డీలర్లు కీత్తాండుర్రి- డీలరింత- మొగ్గుకొట్టి ఉన్నదిత్తాండు...." అన్నదు కోమటి గుండయ్య. రాజిగాడు ఊకొడుతండు.

"అట్లనా సావుకారి" అన్నదు బీరిపోయినట్టు జక్కడు.... రాజిగాడు "మీరు జెప్పుకున్నరా సావుకారి" అన్నడు.

"ఏందిరో నాదిపోనిత్తనారా! నాకు మూడుకిలోలత్తది. కిలా ఇంట్లకైన, రెండుకిలలు అమ్మితె తొమ్మిది, తొమ్మిదిఅత్తయ్. అసలుపైసలు మిగులుతయ్" అన్నదు సావుకారి లాబపడ్డట్టు.

"ఇగో సావుకారి మనూళ్లె కోపన్లమీన గోధుమలు, గాంచునూనె, బియ్యం సరింగా అత్తలేవు.... ఎందుకన్నట్టు" అన్నదు జక్కడు.

యొహె.... మన పక్కపొంటి ఊళ్లెరాంగా.... గీడా గంతాగట్టోడు ఉన్నడా? అన్నదు రాజిగాడు.

జక్క.... ఇగో ఉద్దెరబారమంటె గడ్లెపన్నోడు లేసత్తడు. ఊళ్లెకు సెక్కరంటె తెత్తాండుర్రి- ఇగ గోదుమలు గాంచునూనె అంటే.... ఏదులాపురంల అమ్మికదెం.... తందుర్రి అన్నదు గుండయ్య.

గల్లెందుకు సేత్తాండుర్రి అని అనంతరెడ్డి అడుగుతె కొట్టించుర్రి....మొన్నట దాక దావఖాండ్లనే వుండే.... అన్నదు జక్కడు. మాదిగోల్ల పేరెమ్మ సెక్కరికోట రావల్నని కన్నెనగురంపోయి దరుకాసు పెట్టిచ్చే కతకోటి ఎల్లదు.... అడుసుత రెడ్లతోని కండాయే ... అన్నదు పల్ల గుండయ్య.

"యొహె....మనూరికతే తప్పింది ధర్మారెడ్డి సచ్చినకానుంచి" అన్నదురాజిగాడు.

వారీ.... నాయకుడ్లని తండలెక్కనె వుంటంది మనూరు అన్నడు జక్కడు- రాజిగాన్ని కొడుకువరసతోటి.

ఉన్నసర్పంచి ఊకనే పట్టించుకోకపాయె.... కుక్కలాయిల పడ్డదని బిలాకుల అయిదుయేయిలు తెచ్చుకతినె- గది గట్లపోయినిగని- సపాయోల్లపైసలుగూడ తినబట్టె, అశ్ని అందరున్నరని పారముల రాయవట్టె అన్నదు రాజిగాడు. గా మడిస పొల్లెకు బస్సత్తె దెవరునుకొట్టిరి, రెడ్లు అళ్ల ఇంటికాన్నే బస్సులాపుమనిరి. గిప్పుడుబస్సుల్లేక యెంత తిప్పలైతందోసూడు అన్నదు గుండయ్య.

